క్లుప్తంగా

అంకాల పరమేశ్వరి అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు



ఈపూరు : మండలంలోని కొచ్చర్ల గ్రామంలో వేంచేసి ఉన్న అంకాల పరమేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ఎమ్మెల్యే బొల్లాకు ఘన స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

డొంకమార్గాన్ని తిరిగి ఏర్పాటు చేయాలి



యడ్లపాడు: పూర్వ కాలం నుంచి ఉన్న నడకమార్గాన్ని కొందరు మూసివేశారని తిరిగి దానిని పునరుద్ధరించాలంటూ సోమవారం స్పందన కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని వంకాయలపాడు శివారు డొంక నుంచి ప్రారంభమై ప్రస్తుతం గురుకుల పాఠశాల భవనాల వరకు గొల్లుడు కుంట పేరిటా స్థానికులు, పశువులను తీసుకెళ్లే నడకమార్గం ఉందన్నారు. అయితే కొద్దికాల కిందట సమీపంలో ఉన్న నూలుమిల్లులు మార్గానికి అడ్డంగా కట్టడాలను నిర్మించి మూసివేశారంటూ సదరు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఈ మార్గాన్ని యధావిధిగా అధికారుల పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలంటూ గ్రామవాసి షేక్ హుస్సేన్ తహసీల్దార్ ఎన్.నాగమల్లేశ్వరరావుకు వినతి అందించారు.

పేటలో రెడ్‌క్రాస్ దినోత్సవం



చిలకలూరిపేటటౌన్: రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీడ్యూనాన్ట్ పుట్టిన రోజును రెడ్ క్రాస్ దినోత్సవంగా జరుపుకుంటామని రెడ్ క్రాస్ చిలకలూరిపేట కార్యదర్శి జంపని భాస్కరరావు చెప్పారు. సోమవారం రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో, పట్టణంలోని గడియారస్తంభం సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ముందుగా హెన్రీడ్యూనాన్ట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చుక్కా విన్సెంట్‌పాల్, సుబ్బారావు, రాజ్‌కుమార్, కొండయ్య, ఎ.గురులింగం, బాలస్వామి, మొహిద్దీన్, షరీఫ్, రాజు పాల్గొన్నారు.

19 నుంచి రాష్ట్రస్థాయి బాలల నృత్య, పాటల పోటీలు

వినుకొండ (నూజెండ్ల): కళాసాగరి ట్రస్ట్ వినుకొండ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి బాలల నృత్య, పాటల పోటీలను ఈ నెల 19 నుంచి 21 వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కూచి రామాంజనేయులు సోమవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాల లోపు బాలబాలికలు పోటీల్లో పాల్గొనవచ్చని, పోటీల్లో చిన్నారుల డ్యాన్స్ పోటీలు, శాస్త్రీయ, జానపద, మోడరన్ కళారూపాలుగా సోలో విభాగంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. గెలుపొందిన చిన్నారులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఆరు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్నామన్నారు. ఎంట్రీ ఫీజును చెల్లించి ఈ నెల 18వ తేదీ లోపు చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9581853636, 9885155384 నంబర్లను సంప్రదించాలన్నారు.

10న జిల్లాస్థాయి టెన్నీస్ క్రికెట్ టోర్నమెంట్

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం గ్రామంలో టైగర్ సీసీ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన జిల్లా స్థాయి టెన్నీస్ క్రికెట్ టోర్నమెంటు పోటీలు ప్రారంభించుతున్నట్లు కమిటి సభ్యులు సోమవారం తెలిపారు. మొదట బహుమతి రూ. 50 వేలు (మేకల హనుమంత రావు) రెండవ బహుమతి రూ.30 వేలు (కుంభా యోగయ్య) మూడోవ బహుమతి రూ. 20 వేలు (మేకల రమేష్, సురేష్) నాల్గవ బహుమతి రూ.10 వేలు (పులి గోపి) అందజేస్తున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 7993559923, 9392745010, 7993097407,7892632979 సంప్రదించాలన్నారు. ఎంట్రీ ఫీజు రూ.1000 రూపాయలు చెల్లించాలన్నారు.

శావల్యాపురం సర్పంచ్‌గా చెన్నమ్మ

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం గ్రామపంచాయతీ నూతన సర్పంచ్‌గా యాగసిరి చెన్నమ్మ ప్రమాణ స్వీకార కార్యక్రమం గ్రామసచివాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు మేరకు ఉపసర్పంచ్‌గా విధుల్లో ఉన్న యాగసిరి చెన్నమ్మను సర్పంచ్‌గా నియమాకం చేసినట్లు ఎంపీడీవో పేరు మీనా సీతారామయ్య అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ భీమని అంకారావు, గ్రామపార్టీ కన్వీనర్ దేవనబోయిన వీరనారాయణ, మండల కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్నది ఆదర్శవంతమైన పాలన

- పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు
- నాడు- నేడు వంటి పథకాలతో అభివృద్ధికి బాటలు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రంలో సీఎం వై.ఎస్.జగనన్న ఆదర్శవంతమైన పాలనను అందిస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖామంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని మురికిపూడి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మంత్రి విడదల రజిని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు వివరిస్తూ, ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో వివరిస్తూ కార్యక్రమం కొనసాగించారు. గడపగడపకూ కార్యక్రమాన్ని విచ్చేసిన మంత్రి విడదల రజినికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ అందజేస్తున్నదని వివరించారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి ఆయా పథకాలను అందజేస్తున్నదని వివరించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని పేర్కొన్నారు. వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేని విధంగా పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించటమే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తున్నదని వెల్లడించారు. మరోవైపు నాడు-నేడు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు. ప్రజలంతా ప్రభుత్వానికి అండగా ఉన్నారని చెప్పేందుకు కార్యక్రమానికి లభిస్తున్న స్పందనే నిదర్శనమన్నారు.

కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కొమ్మనబోయిన హరికృష్ణ ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, గ్రామ సర్పంచ్ ఉసర్తి భూలక్ష్మి, ఉప సర్పంచ్ కొమ్మనబోయిన రామకృష్ణరాజు, వైస్ ఎంపీపీ సూరబోయిన ఆదిలక్ష్మి, మురికిపూడి పీఏసీఎస్ అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటశివ, ఎంపీటీసీ సభ్యులు జమ్మలమడక సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉసర్తి రాంబాబు,కొమ్మనబోయిన చెంచురాములు, బోడి సాంబయ్య, గోగు ముక్కంటి, దాసరి హనుమంతరావు, జాష్టి సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని అరెస్టు చేయండి

నరసరావుపేట: మహిళా క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం స్పంధనలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదుకు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ పాలనలో ఇటువంటి వేధింపులు, అక్రమాలు అధికమయ్యాన్నారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) నాయకులు వైవీ వెంకటేశ్వరరావు, రామారావు, ఎం.ఐ.ఎం, బీసీ సంక్షేమ సంఘ నాయకులు ఉన్నారు.

ఆదర్శ రాజకీయ నాయకులు సంజీవయ్య

వినుకొండ(నూజెండ్ల): నియోజకవర్గ మాలమహానాడు కమిటీ ఆధ్వర్యంలో దామోదర సంజీవయ్య వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి పిడుగు విజయ్‌బాబు ఆధ్వర్యంలో నరసరావుపేట రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కమిటీ నాయకులు మాట్లాడుతూ సంజీవయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో దుబ్బలదాసు, పి.విజయ్‌భాస్కర్, టి.సాగర్, అంకారావు పాల్గొన్నారు.

ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరాలు



రొంపిచర్లలో వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

రొంపిచర్ల: మండలంలో సంతగుడిపాడు, రొంపిచర్ల శాఖా గ్రంథాలయాలలో సోమవారం నుంచి వేసవి శిక్షణ శిబిరాలు ఆరంభమైనాయి. సంతగుడిపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరములను ప్రముఖ కవి అచ్చుల సుబ్బారావు ప్రారంభించారు. పుస్తక పఠనం వలన కలుగు ప్రయోజనాలను గురించి వివరించారు. విద్యార్థులు వేసవి శిక్షణా శిబిరములను వినియోగించుకోవాలన్నారు. శిక్షణా శిబిరంలో భాగంగా మొదటి రోజున కథలు చెప్పడం, పుస్తక పఠనం వలన కలుగు ప్రయోజనాలను గురించి వివరించారు. ఉపాధ్యాయులు టి.వెంకటేశ్వర్లు, రాజు, ఆయా శాఖల గ్రంథాలయాధికార్లు కె.వెంకట్రావు, సుబ్బారావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కీర్తి థియేటర్ వద్ద ఉన్న శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయ అధికారి భూక్యా బద్రినాయక్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నామని, ఈ శిబిరంలో చదవడం మాకిష్టం, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్, మ్యూజిక్, డ్యాన్స్, చెస్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు అందరూ సద్వినియోగించుకోవాలని సూచించారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో 2023 వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ శాఖ అధికారి రమావత్ సేవానాయక్ మాట్లాడుతూ 35 రోజుల పాటు 5వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్ గ్రామర్, తెలుగు వ్యాకరణ, జీకే, చెస్, క్యారమ్స్ తదితర అంశాల్లో రోజుకు ఒక అంశంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ తరగతులను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు.

ఈపూరులో...

ఈపూరు: మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో 2023 వేసవి విజ్ఞాన శిబిరం సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ ఆర్.వెంకటేశ్వర్లు నాయక్, ఎంపీడీవో ఎ.ఉషాకిరణ్ ప్రారంభించి మాట్లాడుతూ 35 రోజుల పాటు జరిగే ఈ విజ్ఞాన శిబిరాన్ని 5 తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు సద్వినియోగించుకోవాలని తెలిపారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులను తహసీల్దార్, ఎంపీడీవోలు అందజేశారు. విద్యార్థులకు రోజుకు ఒక అంశంపై శిక్షణ ఉంటుందని, ఇంగ్లిష్ గ్రామర్, తెలుగు వ్యాకరణం, జీకే, చెస్, క్యారమ్స్, చదవడం, కథలు చెప్పడం వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు గ్రంథాలయ అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఈపూరు జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థినీ ఎం.గ్రేసీ గ్రంథాలయంలో పదో తరగతి స్టడీ మెటీరియల్, ఆల్ ఇన్ వన్ బుక్స్‌ను చదువుకొని గ్రంథాలయాన్ని వినియోగించుకొని స్కూల్ మొదటి ర్యాంక్ సాధించినందుకు తహసీల్దార్, ఎంపీడీవోలు షీల్డ్‌ను అందజేశారు. అనంతరం విద్యార్థులకు ఇంగ్లిష్ గ్రామర్‌ను హైస్కూల్ ఉపాధ్యాయులు డి.సుబ్రహ్మణ్యం వరప్రసాద్ బోధించారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల స్థాయి విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు దోహదపడతాయని జిల్లా కోఆపరేటివ్ సంస్థ అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్వర్ణ చినరామిరెడ్డి తెలిపారు. శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వేసవి సెలవులను విద్యార్థులు విజ్ఞాన శిబిరంలో పాల్గొనటం ద్వారా సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పారాలీగల్ అడ్వయిజర్ ఎం.కాంచన మాట్లాడుతూ, రాష్ట్ర గ్రంథాలయశాఖ చేపట్టిన విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గ్రంథాలయాధికారి యడ్లపాటి రాధ, సిబ్బంది సునీల, ఏసుబాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



కోఆర్డినేటర్ దేవిడ్‌రాజు

నాదెండ్ల: ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్, డిప్లమా కోర్సుల్లో ప్రవేశాల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 10వ తేదీన పాలిసెట్ 2023 ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చిలకలూరిపేట కేంద్రం కోఆర్డినేటర్ ఎం.దేవిడ్‌రాజు తెలిపారు. ఈ మేరకు ఆయన గణపవరం చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ, చిలకలూరిపేట ప్రాంతంలో ఆరు కేంద్రాల్లో ప్రవేశపరీక్షలు జరుగుతాయని, మొత్తం 1860 మంది పరీక్షకు హాజరౌతున్నట్లు చెప్పారు. గణపవరం సీఆర్ డిగ్రీ కళాశాల, చిలకలూరిపేట ఏఎంజీ, శారదా హైస్కూలు, ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూల్, మోడరన్ గ్రీన్ వ్యాలీ, చైతన్య స్కూలులో ఆరు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకూ పరీక్ష జరగనున్నందున ఉదయం 9.45 గంటలకే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని తెలిపారు. ఇప్పటికే చాలా మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని, అలా డౌన్‌లోడ్ కాని వారికి అప్లికేషన్ డూప్లికేట్ ఆధారంగా అరగంట ముందు కళాశాలకు చేరుకున్నట్లయితే పరీక్షకు అనుమతిస్తామన్నారు. ఇలాంటి వారు రెండు పాసుపోర్టు ఫోటోలు, పదో తరగతి హాల్‌టికెట్, ఆధార్ జిరాక్సు కాపీలను తీసుకుని కేటగిరిని బట్టి రూ.100-400లు రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. జిల్లా కోఆర్డినేటర్‌గా క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి, చిలకలూరిపేట అసిస్టెంట్ కోఆర్డినేటర్‌గా సీఆర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ లక్ష్మీరాజ్యం వ్యవహరించనున్నట్లు తెలిపారు.

ఖరీఫ్ సాగు సమాయత్తంపై అవగాహన



రైతులతో మాట్లాడుతున్న ఏవో ఆర్. రామారావు

ఈపూరు: సాగు మొదలయ్యే ముందుగా ఎటువంటి ఇబ్బంది లేకుండా రైతులకు కావాల్సిన పచ్చిరొట్ట విత్తనాలు, ప్రధాన పంటల విత్తనాలు, ఎరువులు అన్నీ కూడా రైతు భరోసా కేంద్రాల్లో ముందుగానే అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయ అధికారి ఆర్. రామారావు తెలిపారు. మండలంలోని బొమ్మరాజుపల్లి, ఇనిమెళ్ల గ్రామాల్లో ఖరీఫ్ సాగు సమాయత్తంపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో ముందుగానే అందుబాటులో ఉండేవిధంగా చూసుకోవాలని, తద్వారా రైతులకు ఇబ్బందుల లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి బి.అప్పారావు, గ్రామసర్పంచ్ వై. శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్‌కే,యు.సల్మా మరియు రైతులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో....

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి,శావల్యాపురం రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు అవగాహన సదస్సు కార్యక్రమం వ్యవసాయ అధికారులు సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఈవో పురేటి అశోక పాల్గొని మాట్లాడుతూ ఖరీఫ్ సాగు సమాయత్తం కార్యక్రమంలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ పరమైన యంత్ర పరికరాలు విత్తనాలు ఎరువులు, పచ్చరొట్టి ఎరువులు తదితరవన్నీ కొరత లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. రైతుభరోసా కేంద్రాల వలన రైతులకు కలుగు ప్రయోజనాలు వివరించారు. ఈకార్యక్రమంలో సర్పంచులు తన్నీరు భారతి, యాగసిరి చెన్నమ్మ,పశు వైద్యాదికారి రావెళ్ళ సురేష్, మండల వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటరు బోడెపూడి శ్రీనివాసరావు,వీఏఎలు దారా స్రవంతి, వెంకయమ్మ,రైతులు పాల్గొన్నారు.

గిరిజన గురుకులంలో సత్తాచాటిన విద్యార్థులు



ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను అభినందిస్తున్న విద్యాకమిటీ చైర్మన్ వడితే నాగేశ్వరరావు



విద్యార్థినిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వినుకొండటౌన్ : పట్టణంలోని వెల్లటూరు రోడ్డు నందు గల ప్రభుత్వ గిరిజన గురుకుల బాలుర పాఠశాల నందు 10వ తరగతి విద్యను అభ్యసిస్తున్న జి.వెంకటేష్ ఇటీవల విడుదలైన పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించడం పట్ల విద్యాకమిటీ చైర్మన్ వడితే నాగేశ్వరరావు నాయక్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 189 ప్రభుత్వ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలు ఉండగా మన వినుకొండ విద్యార్థి అత్యధిక మార్కులు సాధించడం గర్వంగా ఉందన్నారు.

అదేవిధంగా ఎస్.సాయి మంచి ర్యాంకు సాధించగా అత్యధిక మార్కులతో ఎస్.కోటేశ్వరరావు, వి. ఇమ్మానుయేలు ప్రతిభ కనపరిచారన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రతిభ కనపరిచిన విద్యార్థులను పాఠశాల సిబ్బందితో కలిసి ఘనంగా సన్మానించారు.

ఉన్నత విద్యావంతులుగా రాణించాలి

నాదెండ్ల: పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత విద్యావంతులుగా రాణించాలని హెచ్ఎం ప్రసాద్ చెప్పారు. మండలంలోని సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గారపాటి మనస్మిత మండలంలో మూడో ర్యాంకును సాధించింది. ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించటంతో హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు విద్యార్థిని మనస్మిత, ఆమె తల్లిదండ్రులను శాలువాలతో సన్మానించారు. ఇదే పాఠశాలలో చదువుతున్న మరో విద్యార్థిని కాకుమాను యమున కూడా మార్కులు సాధించింది. దీంతో ఇరువురు విద్యార్థులను సన్మానించారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయం

చిలకలూరిపేట: విద్యార్థులు అత్యంత ప్రతిభా పాటవాలు చూపి అత్యధిక మార్కులు సాధించడం అభినందనీయమని ఎస్ఎంకే జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం షేక్ మొహమ్మద్ యాసిన్ చెప్పారు. పసుమర్రులోని ఎస్ఎంకే జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు పదోతరగతి పరీక్షా ఫలితాల్లో తన్నీరు హిమబిందు 574, పెట్లూరి రూపాంజలి 569, షేక్ కరిముల్లా 515, షేక్ మహబూబ్ సుభాని 514 మార్కులు సాధించారు. ఈ విద్యార్థులకు సోమవారం పాఠశాల ప్రాంగణంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్‌లో విద్యార్థులు మరింత ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎర్రం వెంకటసుబ్బయ్య, 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు గద్దె హరిబాబు, గోపాళం మధుసూధనరావు, మీరావలి, తిరుపతయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

14న ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల

శావల్యాపురం: హనుమాన్ జయంతి వేడుకలు ఈనెల 14న జరగనున్న నేపథ్యంలో మండలంలోని కనమర్లపూడి గ్రామంలో వేంచేసియున్న ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల వేడుకలకు గ్రామస్తులు సంసిద్ధం చేస్తున్నారు. ఈసందర్భంగా ఎస్సై గల్లా రవికృష్ణ మాట్లాడుతూ తిరునాళ్ల వేడుకల సందర్భంగా విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయు కమిటి సభ్యులు ప్రభుత్వ నిబంధనలు మేరకు తప్పనిసరిగా పోలీసులు అనుమతులు పొందాలన్నారు.

జాతీయ రహదారిపై కారు బీభత్సం

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ పార్వతీపురం గ్రామసమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మందికి పైగా గాయాలయ్యాయి. ఈ ప్రమాదం కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామంలోని పోలేరమ్మ తల్లి తిరునాళ్లకు వెళ్లి వస్తుండగా మార్కాపురం వైపు వెళ్తున్న కారు ద్విచక్ర వాహనాలపైకి దూసుకెళ్లడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో నూజెండ్ల మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన ఎస్‌కే సుభానికి తీవ్రగాయాలు కాగా మరో ఏడుగురికి స్వల్పగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు వైద్యశాలకు తరలించడం జరిగింది. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విధులకు హాజరు కాని వీఆర్వో

యడ్లపాడు: మండలంలోని వంకాయలపాడు వీఆర్వో జయరాజు గతం వారం రోజుల నుంచి విధులకు హాజరు కావడంలేదు. ఇటీవల కలెక్టర్ ఆదేశాల ప్రకారం వంకాయలపాడులో నిర్వహించిన స్పందనకు రాలేదని దీంతో రెవెన్యూ పరమైన సమస్యలను చెప్పుకునే వీలుకాక తీవ్ర ఇబ్బందులకు పడుతున్నామంటూ ప్రజలు వాపోతున్నారు. ఇదే విషయంపై తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావును వివరణ కోరగా వారం నుంచి విధులకు హాజరు కాని మాట వాస్తవమేనని, అయితే తమకు లిఖిత పూర్వకంగా ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. ఇతరుల ద్వారా అతని ఆరోగ్య పరిస్థితి బాగోలేదని తెలిసిందని మంగళవారం కూడా విధులకు హాజరు కాకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశానుసారంగా ఇన్‌చార్జ్ బాధ్యతలు వేరొకరికి ఇవ్వనున్నట్లు చెప్పారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

నరసరావుపేట టౌన్: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ రహంతుల్లా సోమవారం తెలిపారు. పెద్దచెరువుకు చెందిన 18 ఏళ్ల యువతి ఆదివారం ఇంటి నుంచి బజారుకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం దక్కలేదు. ఈ మేరకు యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

10 నుంచి రైల్వే గేటు మూసివేత

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామపంచాయతీ శివారు గ్రామమైన కృష్ణాపురం గ్రామంలోని రైల్వే గేటు 269 సమీపాన రైల్వే పనుల్లో భాగంగా భాగంగా ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు గేటు మూసివేస్తున్నట్లు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు సోమవారం తెలిపారు. రైల్వే అధికారులకు సంబంధిత గ్రామాల ప్రజలు సహకరించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

రొంపిచర్ల: గ్రామ రెవెన్యూ సహాయకులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ అంకారావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. వీఆర్ఏలకు డ్యూటీ సర్టిఫికెట్స్ ఇస్తేనే జీతాలు ఇస్తున్నారని, ఆపద్ధతి రద్దు చేయాలని కోరారు. వీఆర్ఏల చేత వెట్టిచాకిరి చేయించుకుంటున్న అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. సమస్యలను పరిష్కరించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. చెరువుగట్టు సెంటర్ నుంచి ప్రదర్శనగా వెళ్లి వినతి పత్రాన్ని అందజేశారు.

టిడ్కో గృహాల లబ్ధిదారులు వెంటనే ఇళ్లలో చేరాలి



లబ్ధిదారులతో సమస్యలు తెలుసుకుంటున్న షేక్ రఫాని

చిలకలూరిపేట: టిడ్కో గృహాల లబ్ధిదారులు వెంటనే వారివారి గృహాల్లో చేరిపోవాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని కోరారు. టిడ్కో గృహ సముదాయాన్ని మున్సిపల్ అధికారులతో కలసి చైర్మన్ సోమవారం పరిశీలించారు. టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న లబ్ధిదారులకు ఇంకా అవసరమైన మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో గృహాల లబ్ధిదారులకు అవసరమైన ఎలాంటి సదుపాయాలనైనా కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కొంతమంది లబ్ధిదారులు వారికి కేటాయించిన గృహాల్లో చేరని కారణంగా ఆయా ఇళ్లు మరమ్మతులకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటి వరకు ఇళ్లలో చేరని లబ్ధిదారులు వెంటనే గృహాల్లో చేరాలని సూచించారు. త్వరలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో టిడ్కో గృహ సముదాయంలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈఈ తోట వెంకటరమణ, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ కె.సునీత, సిబ్బంది పాల్గొన్నారు.